రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. కర్నూలు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి కొత్త రైల్వే లైన్‌లు, రైళ్లు వేయాలని కోరారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. రాజధాని అమరావతికి కర్నూలు నుంచి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. 48 ఏళ్లుగా మూలనపడిన కర్నూలు-మంత్రాలయం రైల్వే లైన్ డీపీఆర్‌కు ఆమోదం తెలిపి బడ్జెట్ కేటాయించాలన్నారు. కాచిగూడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ వరకు పొడిగించాలని, రిహాబిలిటేషన్ వర్క్‌షాపునకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే కర్నూలు నుంచి విశాఖపట్నంకు రైలును కేటాయించాలన్నారు. రైల్వే సమస్యలపై కర్నూలు, నంద్యాల ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడాలని, ఈ మేరకు వారికి కూడా వినతిపత్రాలు ఇచ్చినట్లు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి చెప్పారు. నాయకులు సాయిబాబా, సుధాకరప్ప, రామకృష్ణ,షరీఫ్, అబ్దుల్లా, నగేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెజబ్బులపై రేపు అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బుల గురించి ఫిబ్రవరి 2వ తేదీ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సదస్సులో గుండెపోటు నివారణలో యాంజియోగ్రామ్, స్టెంట్ అమరిక పాత్ర గురించి తాను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమం

కర్నూలు(సెంట్రల్): కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ చట్టాలను రద్దు చేసిన ప్రధాని నరేంద్రమోదీ వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టారన్నారు. వీటి ద్వారా కార్మికులు తమ హక్కులను కోల్పోయారని, ముఖ్యంగా 8 గంటల పని విధానానికి స్వస్తి పలకాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఏప్రిల్ నుంచి లేబర్ కోడ్లను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, వాటిని తిప్పికొట్టడానికి కార్మికులు ముందుకు రావాలన్నారు. ఇందుకోసం ఫిబ్రవరి 5వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే నిరసన పోరాటంలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు గౌస్‌దేశాయ్, ఈరన్న, వెంకట్, ప్రభాకర్, జయనాగేశ్వరరావు, సాయిబాబా పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఎస్సీ కులాల తుది జాబితా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పలు మండలాల్లో రూపొందించిన ఎస్సీ కులాల సామాజిక కులగణన తుది జాబితా అసంపూర్తిగా ఉందని మాల జేఏసీ చైర్మన్ కాసారపు వెంకటేష్ ఆరోపించారు. ఈ జాబితా వల్ల ఎస్సీ కులాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణగిరి మండలంలోని గ్రామ సచివాలయాల్లో తప్పులతడకగా కులగణన చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కులగణనకు సంబంధించిన రిపోర్టులో మతం అనే కాలమ్‌లో ఏమీ రాయకుండా తుది జాబితాను విడుదల చేయడం ఎస్సీల హక్కులను కాలరాయడమేనన్నారు. జిల్లాలో పలు మండలాల్లోని గ్రామ సచివాలయాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. తప్పులతడకగా ఉన్న జాబితాను సరిచేసి ఎస్సీ కులాల ప్రజలకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో సమస్యపై జేసీ, కలెక్టర్, చీఫ్ సెక్రటరీ, ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్ సీసీఎల్ఏకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

క్రీడాకారుడికి అభినందన


క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు (టౌన్): మంగళగిరిలో ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహించనున్న 7వ ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటి విజేతగా నిలవాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని తన చాంబర్‌లో పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థి బి.శ్రీనివాసులును అభినందించారు. క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పారా అథ్లెటిక్స్‌లో బంగారు పతకంతో తిరిగి రావాలన్నారు. పోటీలకు అయ్యే ఖర్చు యూనివర్సిటీ భరిస్తుందన్నారు. రిజిస్ట్రార్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్ సుందరానంద పుచ్చ, వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామానికి చెందిన గుజ్జుల కవిత (14) అనే విద్యార్థిని శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. బాలిక స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గత కొంత కాలంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో గుంతకల్లు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రప్ప తెలిపారు. హంప గ్రామానికి చెందిన కవితకు పదేళ్ల క్రితమే తల్లిదండ్రులు సరస్వతి, సుధాకర్ చనిపోవడంతో అవ్వాతాతలు శాంతమ్మ, అంజినప్ప వద్ద ఉంటూ చదువుకుంటోంది. బాలిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గృహ ప్రవేశాలు వాయిదా

తుగ్గలి: నియోజకవర్గంలో 530 ఇళ్ల లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించే కార్యక్రమం వాయిదా పడింది. ఆయా మండలాల్లో శనివారం తలపెట్టిన గృహప్రవేశ కార్యక్రమం.. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కా గృహాలు మంజూరుకాగా లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు చివరి దశలో ఉండగా ప్రభుత్వం మారింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిర్వహించ తలపెట్టింది. ఈ క్రమంలో ప్రవేశాలు వాయిదా పడ్డాయి.

గుర్తింపు లేని స్కూల్‌ను సీజ్ చేయాలి


డిప్యూటీ డీఈఓ హనుమంతరావుకు వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏక్యాంపులోని ఆ స్కూల్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకపోయినా స్కూల్‌ను నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ధనార్జనే ధ్యేయంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, విద్యాశాఖ అధికారులు స్పందించి స్కూల్‌ను సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ డీఈఓ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణకుమార్, నాయకులు మైఖెల్, సూర్య, రాము, అస్లాం, కిరణ్, మధు, తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు (సెంట్రల్): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవచ్చని ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం వర్సిటీలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు 2025లో భాగంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతివేగంతో ప్రాణ నష్టం సంభవించే అవకాశముందన్నారు. చిన్నపొరపాట్లు కూడా ప్రాణాపాయానికి దారి తీస్తాయని, రహదారిపై వెళ్తున్న సమయాల్లో రెప్పపాటు అలసత్వం కూడా ప్రాణాలు తీస్తుందన్నారు. ప్రిన్సిపాళ్లు కృష్ణారెడ్డి, నరసింహులు, వై.హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ కులాలకు యూనిట్లు పెంచాలి


మాట్లాడుతున్న దేవపూజ ధనుంజయ ఆచారి

కర్నూలు(అర్బన్): జిల్లాలో బీసీ జనాభాకు అనుగుణంగా కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాల యూనిట్లను పెంచాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సబ్సిడీ రుణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 1673 యూనిట్లను మాత్రమే మంజూరు చేసిందన్నారు. జిల్లాలోని 26 మండలాల్లో 484 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒక్కో గ్రామ పంచాయతీలో కనీసం 10 బీసీ కులాలు ఉన్నాయన్నారు. ఒక్కో గ్రామంలో ఒక బీసీ కులానికి ఒక యూనిట్ ప్రకారమైనా కనీసం 5 వేల యూనిట్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం మంజూరైన యూనిట్ల ద్వారా ఒక్కో గ్రామంలో ముగ్గురికి మాత్రమే సబ్సిడీ రుణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాలతో పాటు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో అధిక బీసీ జనాభా ఉందన్నారు. ఈ మున్సిపాలిటీల్లో కూడా అధికంగా బీసీ జనాభా ఉన్న నేపథ్యంలో యూనిట్లను పెంచాలన్నారు. జిల్లాలో వలసలను నివారించేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారందరికీ రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి పంపి బీసీ కులాలకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు హరికృష్ణాచారి, తిమ్మయ్య ఆచారి, హేమంత్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటికలు ఆర్థికంగా ఎదగాలి


బీసీ కార్పొరేషన్ ఈడీని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఆరెకటిక సామాజిక వర్గానికి చెందిన ప్రజలు బీసీ రుణాలను పొంది ఆర్థికంగా ఎదగాలని ఆరెకటిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌డీ కృష్ణోజీరావు కోరారు. ఆయన శుక్రవారం తమ సామాజిక వర్గానికి చెందిన ప్రజలతో కలిసి బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.జాకీర్‌హుసేన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని బీసీ కులాలకు ఇస్తున్న విధంగానే ఆరెకటిక కులానికి చెందిన వారికి రూ.2 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందన్నారు. రూ.2 లక్షల రుణానికి రూ.50 వేలు, రూ.5 లక్షల రుణానికి రూ.75 వేలు సబ్సిడీ ఉందని ఈడీ వెల్లడించారన్నారు. ఈ అవకాశాన్ని ఆరెకటిక కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారు ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దోమలను నివారించాలి


నీటి నిల్వలను పరిశీలిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని నివాసిత ప్రాంతాల్లో దోమలు పెరుగుదలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డెమో శ్రీనివాసులు శెట్టి సూచించారు. స్థానిక శ్రీరామనగర్‌లో నిర్వహిస్తున్న ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహ పరిసరాల్లో పాతటైర్లు, కొబ్బరి చిప్పలు, పాత డబ్బాలు, ఉపయోగించని రోళ్లు తదితరాలు లేకుండా చూసుకోవాలని, ఈ మేరకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తించినట్లయితే వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేసి, సంబంధిత వార్డు సచివాలయ సెక్రటరీ ద్వారా సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. తద్వారా దోమల వల్ల వ్యాప్తి చెందే మలేరియా,డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడు వాపును అరికట్టవచ్చన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య విద్య బోధకురాలు పద్మావతి, ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు.. ముప్పతిప్పలు


ఎన్.సుగాలితండా ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూడిపోయిన డ్రైనేజీ కాలువ



భూపాల్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త వద్ద పందుల సంచారం

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్త
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- దృష్టి సారించని పంచాయతీ అధికారులు

కర్నూలు (రూరల్): స్వచ్ఛ భారత్ లక్ష్యం నెరవేరడం లేదు. పేరుకే స్వచ్ఛతా హీ సేవా.. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్... స్వచ్ఛ భారత్ నినాదం. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధం. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలు పలుకుతున్నారు. పంచాయతీ అధికారుల అలసత్వం ప్రజలకు శాపంగా మారింది. రోడ్లపైనే చెత్తదిబ్బలు.. కాలువల నిండుగా మురుగు.. రోజుల తరబడి అలానే ఉండడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. కడుపు తిప్పేస్తోం. దుర్గంధంతోనే సహజీవనం చేస్తూ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోగాలు వ్యాప్తి చెందుతున్నా పాలకుల్లో చలనం ఉండడం లేదు. ఇంతటి దుర్భర పరిస్థితి ఉన్నది ఎక్కడో కాదు. కర్నూలు నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉండే నందనపల్లె గ్రామ పంచాయతిలో. ఇక్కడ గిరిజనులు, దళితులే ఎక్కువగా నివసిస్తున్నారు. నగర శివార్లలో ఉండే గ్రామాల్లో పరిశుద్ధ్యం పనులు ఇలా ఉంటే.. మారుమూల గ్రామాల్లో పరిశుద్ధ్య పనులు ఎలా ఉంటాయో అధికారులకు తెలియాలి. నిర్వహణ కొరవడి గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది. గ్రామాల్లో స్వచ్ఛ భారత - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించినప్పుడు అధికారులు రావడం..కొన్ని చోట్ల చెత్తను శుభ్రపరిచినట్లు ఫొటోలు దిగడం, వెళ్లిపోవడం జరుగుతోంది. కర్నూలు మండల పరిధిలోని నందనపల్లె, దిన్నెదేవరపాడు, ఈ.తాండ్రపాడు, జి.సింగవరం, ఆర్.కొంతలపాడు, పడిదెంపాడు, సుంకేసుల గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది.

గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు సాఫీగా సాగడం లేదు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో రోజు కాలువల్లో పూడికతీత పనులు చేపడితే ఈ పరిస్థితి ఉండదని ప్రజలు అంటున్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి రోడ్లపైన ఉన్న చెత్తాచెదారాలను తొలగించాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం


గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగు నీరంతా ఇంటి ముందే నిలిచిపోయింది. దోమల బెడద ఎక్కువగా ఉంది. రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. గిరిజన, దళిత కుటుంబాలు నివసించే కాలనీలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువ మురుగుతో నిండిపోయింది. భక్తులు, గ్రామస్తులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.
– యోగేష్ నాయక్, ఎన్.సుగాలితండా

విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలల వర్గీకరణ


పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి ఎస్.రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని నగరపాలక కమిషనర్, నోడల్ అధికారి ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ ఉన్నత పాఠశాల, మామిదాలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కమిషనర్ పరిశీలించారు. విద్యార్థుల నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 117 ఉప సంహరణలో భాగంగా విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలను క్లస్టర్లుగా వర్గీకరించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. కర్నూలు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను క్లస్టర్లుగా విభజించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి క్లస్టర్‌కి ఒక ప్రధానోపాధ్యాయుడు ఉంటారని, వారిపై ఎంఈఓలు ఉంటారన్నారు. అర్బన్ ఎంఈఓ-2 విజయకుమారి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భజన పోటీల విజేత అలంపూర్

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన అంతర్రాష్ట్ర భజన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం అలంపూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు శుక్రవారం సర్పంచ్ శంకరమ్మ, దాతలు, గ్రామ పెద్దలు బహుమతులను అందజేశారు. విజేత అలంపూర్ బృందానికి రూ.25 వేలు, తర్వాతిస్థానాల్లో నిలిచిన బృందాలు ముక్కెళ్లకు రూ.20 వేలు, వడ్లవానిపల్లెకు రూ.15 వేలు, శంకరాపురానికి రూ.11 వేలు, మదుగుపల్లెకు రూ.10 వేలు, గోవిందెన్నకు రూ.9 వేలు, హలిగేరకు రూ.8 వేలు, తురువగల్లుకు రూ.6 వేలు, గోవపరాజుపల్లెకు రూ.5 వేలు, దొడగొండ జట్టుకు రూ.3 వేలు నగదు అందజేశారు. ఉత్తమ హార్మోనిస్టుగా శంకరాపురానికి చెందిన శ్రీనివాసరెడ్డి, ఉత్తమ తబలిస్టుగా వడ్లవానిపల్లెకు చెందిన బాషా, ఉత్తమ గాయకుడిగా సోమశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. వీరికి నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతిగా రూ.500 చొప్పున అందజేశారు.

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వాయిదా వేయాలి


జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును రెండేళ్ల పాటు వాయిదా వేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా రిజిస్ట్రార్ ఎం.చెన్నకేశవరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘంరాష్ట్ర కమిటీ సభ్యుడు ఇ.పుల్లారెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణ రంగం సంక్షోభంలో ఉన్నందున బిల్డర్స్‌తో పాటు వేలాది మంది వర్కర్స్ ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు వెయ్యి వరకు భవనాల అమ్మకాలు నిలిచిపోయాయని, వాటి నుంచి సంబంధిత బిల్డర్లకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లే ముప్పు ఉందన్నారు. కర్నూలు నగరంలో ఎప్పుడూ లేని విధంగా వందలాది ఇళ్లకు టులెట్ బోర్డులు కనిపిస్తున్నాయని వివరించారు. ఈ సమయ ంలో ఆస్తి విలువను పెంచి రిజిస్ట్రేషన్ చార్జీలను హెచ్చి ంపజేస్తే రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలే ప్రమాదముందని, రెండేళ్ల పాటు చార్జీల పెంపును వాయిదా వేసుకోవాలని కోరారు. సమావేశంలో గోరంట్ల రమణ, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు కళాశాలల విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో 2వ తేదీ కళాశాలల విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ చంద్రశేఖర్ తెలిపారు. ఓల్డ్‌సిటీ కండేరిలోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కళాశాలల విద్యార్థులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 90003 80172 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు


వెంకటరమణ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక వెంకటరమణ కాలనీ, వీసస్ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాలలో, పాతబస్తీలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్, ఖడక్‌పురా కాలనీల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న పంప్‌హౌస్ డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో తొలి ప్రాధాన్యత కింద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజా ఫిర్యాదుల అభ్యర్థనల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రహదారులు, మురుగు కాల్వలు వంటి నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్పొరేటర్ రాజేశ్వర రెడ్డి, డీఈఈ గంగాధర్, ఏఈ నాగజ్యోతి, మనోజ్ పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం


ఏడీ రమేష్‌బాబును సన్మానిస్తున్న ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పనిచేసి శుక్రవారం పదవీ విరమణ చేసిన రమేష్‌బాబును ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రమేష్‌బాబు సేవలను కొనియాడారు. అలాగే ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏడీని ఘనంగా సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, సీఎస్ ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

– ప్రభుత్వ ఆసుపత్రిలో అనస్తీషియా విభాగం ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ కొండారెడ్డిని కర్నూలు మెడికల్ కాలేజీలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏలో ఏఓ/ ఏపీఓ (పింఛన్లు)గా పనిచేస్తున్న షరీఫ్ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన్ను డీఆర్‌డీఏ పీడీతో పాటు అదనపు పీడీ శ్రీధర్‌రావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి మెగా క్రికెట్ టోర్నీ


ప్రత్యేకంగా తయారు చేసిన క్రికెట్ పిచ్

పత్తికొండ రూరల్: పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం నుంచి 18 రోజుల పాటు మెగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కందనాతి సుంకన్న తెలిపారు. సౌత్ ఇండియా లెవెల్ -టి 20 క్రికెట్ టోర్నమెంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ టోర్నీకి చెన్నై, బెంగళూరు, హోస్పేట్, బళ్లారి, హుబ్లీ, రాయచూర్, కొప్పాల్, నంద్యాల, గద్వాల, కర్నూలు, గుంతకల్లు, అనంతపురం, హిందూపురం, ఆదోని తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలిరానున్నారన్నారు. దాతల సహాయంతో టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే విజేతలకు వరుసగా రూ.2,16,000, రూ.1,16,000, రూ.50,116 అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలకు సిద్ధం చేశామన్నారు.

వలసల నివారణకే ఉపాధి పనులు

కర్నూలు (రూరల్): వలసల నివారణకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నామని.. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మధుబాబు అన్నారు. ఉల్చాల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం కూలి పనులు చేస్తే రూ.300 వరకు వేతనం వస్తుందని తెలిపారు. మార్చి 31వ తేదీకి 100 రోజుల పనిదినాల గడువు ముగుస్తుందని.. ఆలోగా కూలీలంతా వారి పని దినాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. 50 మంది కలిసి ఒక శ్రమశక్తి సంఘంగా ఏర్పడితే అందులో ఒకరిని మేటీగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వలసలు పోకుండా అందరూ ఉపాధి హామీ పథకం పనులకు రావాలని కోరారు. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో పనుల ప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా


బూత్‌లెవల్ ఆఫీసర్లకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

కర్నూలు(రూరల్): సచివాలయాల పరిధిలో ఓటర్ల జాబితాను పక్కాగా పరిశీలించాలని తహసీల్దార్ టీవీ రమేష్ బాబు అన్నారు. స్టాంటన్‌పురం, మామిదలపాడు, గీతాముఖర్జీ నగర్ సచివాలయల పరిధిలోని బూత్‌లెవల్ ఆఫీసర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఓటర్లు నివాసం ఉంటున్న ప్రాంతాలకు దగ్గరలోని పోలింగ్ బూత్‌లో వారికి ఓటు హక్కు ఉండేలా చూడాలని సూచించారు. కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ బూత్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా తయారు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.